www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 6 ఫిబ్రవరి 2024
5
చిత్తూరు

జిల్లా అడిషనల్ ఎస్పిగా ఏవి.సుబ్బరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో 4వ అడిషనల్ ఎస్పి, ఎస్ఈబిగా ఏవి.సుబ్బరాజు సోమవారం మిట్టూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎక్సైజ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయనగరం జిల్లాకు చెందిన ఏవి.సుబ్బరాజు 1989 బ్యాచ్‌లో ఎస్సైగా పోలీసుశాఖలో చేరారు. ఎస్ఐగా పలుచోట్ల పనిచేసి 2001లో సిఐగా పదోన్నతి పొంది శ్రీకాకుళం జిల్లాలో 7సంవత్సరాలు విధులు నిర్వహించారు. 2010లో డిఎస్పీగా విజయనగరం సిఐడి, ఎస్‌బి, ఇంటలిజెన్స్, విశాఖపట్నంలో ఏసిబి, పోలీస్ ట్రైనింగ్ సెంటర్ విజయనగరంలో పనిచేసి 2020లో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది మొదటగా ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా, వెస్ట్ గోదావరి జిల్లా భీమవరంలో అడ్మిన్‌గా పనిచేశారు. చిత్తూరు జిల్లా 4వ అడిషనల్ ఎస్పీ ఎస్ఈబిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

యోధుల నామ (కుల) స్మరణ

- పంచాయతీకి డబ్బు కట్టు.. ప్రభుత్వ స్థలాల్లో విగ్రహాలుపెట్టు
- కులాల కోరల్లో మహనీయులు
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కుల విగ్రహాలు

ప్రజాశక్తి- వికోట

ప్రజల కోసం, సమాజం కోసం పోరాడి తమ ప్రాణాలను లెక్కచేయక త్యాగాలు చేసిన మహనీయుల చారిత్రక గాథలను భావితరాలకు తెలియజేసేందుకు సహజంగా పట్టణ కూడల్లలో మహానేతల విగ్రహాలు నెలకొల్పుతుంటారు. అటువంటి విగ్రహాలు చూసినప్పుడు వారు చేసిన త్యాగాలు భవిష్యత్ తరాలకు సూచికగా గుర్తుకు రావాలి.. వారి ఆశయ సాధనలో ముందుకెళ్లాలన్న లక్ష్యం ప్రతి ఒక్కరు గుర్తించాలి..అప్పుడే వారి విగ్రహాలకు విలువ ఉంటుంది. అయితే మండల కేంద్రమైన వికోటలో కులరక్కసి విలయ తాండవం చేసే దిశగా ముందుకెళ్తోంది. అందుకు నిదర్శనమైన కులవిగ్రహాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.

కురబకులస్తులు ఇటీవల ప్రారంభించిన భక్త కనకదాసు విగ్రహం

కుల జనుల కోసం మహనీయులు పోరాడకపోయినా సమాజ ఉద్ధరణకు పాటుపడిన వారిని గుర్తించి తమ కులంలో ఒకరి విగ్రహం ఉండాలని, కులాన్ని ప్రతిబింబించేలా కుల ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని వీకోట ప్రజల్లో ఎన్నడూ లేనివిధంగా ఈ మధ్యకాలంలో కులపిచ్చి పుట్టుకొస్తోంది. ప్రస్తుతం అంబేద్కర్ కూడలిలో ఒక్కొక్కటిగా కులాల వారీగా విగ్రహాలు వెలుస్తున్నాయి. ఇప్పటివరకు రాజ్యాంగ నిర్మాత దళిత బాంధవుడు, దేశానికి దిశాదశను సూచించిన మహానేత. అంబేద్కర్ విగ్రహాన్ని మొదట దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతర కాలంలో తెలుగుదేశం పార్టీ నేతలు తమ అభిమాన నేత పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని అంబేద్కర్ కూడలిలో నెలకొల్పారు. వికోట పట్టణం ఎగువ చెక్‌పోస్ట్ కూడలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తమ నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని జాతీయ రహదారిపై నెలకొల్పారు. ఇప్పటివరకు వారు ప్రజల కోసం చేసిన సేవలు త్యాగాలను భావితరాలకు తెలియజేసేందుకు అవి దోహదపడేవి. ఈ క్రమంలో కురబకుల నాయకులు కనకదాసు విగ్రహం అంబేద్కర్ కూడలిలో ఇటీవల ఏర్పాటు చేశారు. దీంతో అన్ని కులాల్లో వారు వారివారి కుల మహా నాయకులు, ప్రముఖుల విగ్రహాలను స్థాపించాలని చర్చించుకున్నారు. దీంతో కుల విగ్రహాలు ఏర్పాటుకు బీజం పడింది. కాపు కులానికి చెందిన కెంపెగౌడ విగ్రహానికి ఇటీవల భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఇదే అదనుగా రెడ్డి కులాలవారు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం పెట్టేందుకు సమావేశమై నిర్ణయించారు. బలిజ కులస్తులు శ్రీకృష్ణదేవరాయల విగ్రహం స్థాపించడానికి స్థలాన్ని కూడా ఎంపిక చేసుకున్నారు. వాల్మీకి కులస్తులు వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. వడ్డెరలు వడ్డే ఓబన్న విగ్రహం కావాలంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించి కులపెద్దలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యుదయవాదులు జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు భూమిపూజ నిర్వహించారు. అదే విధంగా వన్యకుల క్షత్రియులు ధర్మరాజులు విగ్రహాన్ని క్షత్రియులు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి పంచాయతీ అనుమతులకు దరఖాస్తు చేసుకున్నారు. గ్రామపంచాయతీ వారు చేసేదేమీ లేక పంచాయతీ పరిధిలో విగ్రహాలు నెలకొల్పేందుకు కొంత రుసుమును నిర్ణయించడంతో కుల నాయకులు పంచాయతీ తీర్మానించిన మొత్తాన్ని చెల్లించి విగ్రహాలు పెట్టేందుకు ముమ్మర ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో కుల సంఘాల నేతలు **పంచాయతీకి డబ్బు కట్టు ప్రభుత్వ స్థలాల్లో విగ్రహాలు పెట్టు** అన్నదానికి కట్టుబడి పోటాపోటీగా చందాలు వసూలు చేస్తూ విగ్రహాలు పెట్టేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయం పట్ల మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మహనీయుల చరిత్రను ఒక్కో కులానికి ఆపాదించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భావితరాలకు మంచి సందేశం ఇవ్వాల్సిన నేటితరం నేతలు మహనీయులకు కులాలను ఆపాదించడం ఎంతవరకు సమంజసమని చర్చించుకుంటున్నారు. సమాజం ఎటు వెళ్తుందోనని భవిష్యత్ తరాలు కులాల కొట్లాటకు బాటలు వేస్తున్నారని కొందరు ఆందోళన చెందుతున్నారు.

కెంపే గౌడ విగ్రహ ఏర్పాటుకు పనులు ప్రారంభించిన కాపు నేతలు

ప్రజాశక్తి- కుప్పం: అధికార ప్రతిపక్షాలు ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఎత్తులకు పైఎత్తులకు సిద్ధమయ్యారు. స్తబ్దుగా ఉన్న ప్రజాదృష్టిని తమ వైపునకు తిప్పుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. 'సిద్ధం' పేరిట అధికార పార్టీ పోస్టర్లు ఆవిష్కృతం కాగా పోటీగా ప్రతిపక్ష ఉమ్మడి జనసేన, టీడీపీకి చెందిన 'సంసిద్ధం' పోస్టర్లు అంతటా వెలుస్తున్నాయి. రాష్ట్రమంతటా ఎలా ఉన్నప్పటికీ ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో పోటీపోటీగా ఆయా పార్టీ నేతలు ఈ పోస్టర్లను ఎక్కడచూసినా అంటిస్తున్నారు. దీంతో పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

పోటాపోటీగా ఫ్లెక్సీలు

'సిద్ధం' అని ఒకరు.. 'సంసిద్ధం' ఇంకొకరు

కుప్పంలో పోటాపోటీగా టిడిపి, వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

16న భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు నిరసిస్తూ 16న జరిగే భారత్ బంద్ జయప్రదం చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం చిత్తూరు నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, జిల్లా నాయకులు సురేంద్రన్, సీనియర్ నాయకులు పి.చైతన్యలు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజలను సమస్యలు పట్టించుకోకుండా తప్పుదారి పట్టిస్తున్నదని విమర్శించారు. అన్నిరకాల ప్రజలు వ్యాపారస్తులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, మహిళలు అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని వీరి గురించి పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తులకు దేశసంపదను కట్టబెడుతున్నదని ధ్వజమెత్తారు. చిత్తూరు నగరంలో కూడా అనేక రకాల ప్రజా సమస్యలు ఉన్నాయని, వాటిపై సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని ప్రజలు, వ్యాపారస్తులు సిపిఎంను ఆదరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ రాష్ట్రంలో కార్మికులకు ప్రజలకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని తెలిపారు. నాయకులు లోకయ్య, చిట్టెమ్మ, అర్జున్, ప్రసాద్,దాము, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న సిపిఎం నేతలు

'స్పందన'కు వినతుల వెల్లువ

స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌లతో కలసి జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 218 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా రెవెన్యూ శాఖకు సంబంధించి 167, జిల్లా ఉపాధి కల్పన శాఖ 2, పోలీసు శాఖ 7, డిఆర్‌డిఏ 4, విద్యాశాఖ 2, ఎపిఎస్ పిడిసిఎల్ 3, ఐసిడిఎస్ 2, డిపిఓ 1, ఎండోమెంట్ 1, డిసిహెచ్ఎస్ 2, జిల్లా స్పోర్ట్స్ 1, ఎన్విరాన్మెంట్ ఇంజనీరింగ్ పొల్యూషన్ బోర్డు 1, ఏపిఎస్ఆర్‌టిసి 2, సర్వేశాఖ 2, జిల్లా ఖజానాశాఖ 1, జిల్లామైనారిటీ వెల్ఫేర్ శాఖ 1, సోషల్ వెల్ఫేర్ 1, నేషనల్ హైవే 1, జిల్లా ఫారెస్ట్ 1, జవ్ ళి శాఖ 1, ఎంపిడిఓ బంగారుపాళ్యం 1, హౌసింగ్ శాఖ 4, ఇతరులు10 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓలకు తమ వినతులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి

అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్.ఆరిపుల

సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 20 ఫిర్యాదులను అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్.ఆరిపుల్ల స్వీకరించారు. జిల్లా ఎస్పీ పి.జాషువ ఆదేశానుసారం స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా అడిషనల్ ఎస్పీ ఆదేశించారు. పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి 20 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్.ఆరిపుల్ల, డిటిసి డిఎస్పీ శ్రావణ్ కుమార్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 20 ఫిర్యాదులు అందాయి.

వినతులను వేగంగా పరిష్కరించండి

కమిషనర్ డాక్టర్ జె.అరుణ

'స్పందన' కార్యక్రమంలో ప్రజలు నుంచి వచ్చిన వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర ప్రజలు వివిధ సమస్యలపై కమిషనర్‌కు వినతలు అందించారు. అందిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. స్పందన వినతులపై అధికారులు క్షేత్రస్థాయి విచారణ జరిపి వేగంగా పరిష్కరించాలని, పరిష్కరించిన అనంతరం నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ 3, టౌన్ ప్లానింగ్ 2, మెప్మా 1, ప్రజారోగ్య విభాగం 1 చొప్పున మొత్తం 7 వినతులు అందాయి. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

స్పందనలో వినతులు స్వీకరిస్తున్న నగర కమిషనర్ అరుణ

బెంబేలెత్తిస్తున్న భీ'కరి'

- పంట పొలాలపై దాడులు
- భయాందోళనలో గ్రామస్తులు
- శాశ్వత పరిష్కారం కోసం రైతన్నల ఎదురుచూపు..

ప్రజాశక్తి- సోమల: మండలంలోని పలు పంచాయతీలలో ఏనుగులు నిత్యం సంచరిస్తూ స్వైర విహారం చేస్తూ పంట పొలాలపై దాడులు చేసి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఇది నిత్యకృత్యం అయిపోయింది. పెద్దఉప్పరపల్లి, పేటూరు, అన్నెమ్మగారిపల్లి, ఆవులపల్లి పంచాయతీలలో ఎక్కువగా అటవీ ప్రాంతాలు ఉన్న కారణంగా గ్రామాలకు సమీపంలోనే ఏనుగులు స్థావరం ఏర్పరచుకొని అప్పుడప్పుడు పంట పొలాలపై దాడులు చేస్తూ రైతులకు తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయి.

ఈ ప్రాంత రైతులు, అటవీ శాఖ సిబ్బంది సంయుక్తంగా ఏనుగుల భారీ నుండి శాశ్వత పరిష్కారం కోసం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేకపోయింది. ఇటీవల ఏనుగుల మంద నుండి విడిపోయిన రెండు ఏనుగులు జనవరి 31వ తేదీ ఇరికిపెంట, చెన్నపట్నం చెరువు సమీపంలోని రైతుకు చెందిన అరటి పంటను ధ్వంసం చేయగా రైతులు, అటవీశాఖ సిబ్బంది కలసి వాటిని తరిమేందుకు ప్రయత్నించారు. అయితే అవి తమ్మినాయునిపల్లి పంచాయతీలోని పేగలవారిపల్లి అటవీప్రాంతానికి చేరుకున్నాయి. అక్కడి రైతులు, అటవీ సిబ్బంది వాటిని తరిమెందుకు ప్రయత్నించగా అవి నిమ్మనపల్లె మండలంలోకి వెళ్లిపోయాయి. ఆ తర్వాత మండలంలో ఎక్కడా ఏనుగుల సంచారం లేకపోయినా అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం, కలికిరి మండలాల్లోని అటవీ సరిహద్దు గ్రామాలలో పంట పొలాలలో తిరుగాడుతూ అక్కడి రైతులను, గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తూ వచ్చాయి. కలికిరి మండలం మేకలవారిపల్లి, చారవాండ్లపల్లి ప్రాంతాలలో శనివారం రాత్రి సంచరించడంతో రైతులు, అటవీ అధికారులతో కలిసి జంట ఏనుగులను తరమగా అవి మళ్లీ సోమల మండలంలోకి ప్రవేశించాయి. కాగా ఆదివారం రాత్రి నెల్లిమంద, సోమల పంచాయతీలో పలు పంట పొలాలపై సంచరిస్తూ వరి, అరటి పంటలకు నష్టం కలిగించినట్లు రైతులు చెబుతున్నారు.

వరి పంటపై నడుచుకుంటూ వెళ్లిన ఏనుగుల పాదముద్రలు, అరటి చెట్టును ధ్వంసం చేసిన దృశ్యాన్ని చూపుతున్న రైతు



నెల్లిమంద కమ్మపల్లికి చెందిన బాషా సాహెబ్‌కు చెందిన 15 గుంటల వరిపైరును ధ్వంసం చేసినట్టు వీఆర్వో సుబ్రహ్మణ్యం తెలిపారు. అక్కడనుండి బయలుదేరిన ఏనుగులు సోమల పంచాయతీ ముండ్రివారిపల్లెకు చెందిన రైతు కృష్ణయ్య వరి పైరు పై నడుచుకుంటూ వెళ్లడంతో నష్టం జరిగినట్టు రైతు కుమారుడు మల్లికార్జున తెలిపారు. కందూరు- సోమల ప్రధాన రహదారిని దాటుకుని చెన్నయ్యగారిపల్లె సమీపంలోని గొల్లపల్లికు చెందిన సోమశేఖర్, భాస్కర్, రెడ్డప్ప అనే రైతులకు చెందిన వరి పైరుపై నడుచుకుంటూ వెళ్లాయి. 8రోజుల క్రితం వరి పైరు నాటడం జరిగిందని మొలక దశలోనే ఉన్న పంటపై ఏనుగులు నడుచుకొని పోవడంతో నష్టం వచ్చిందని, తమ పొలంలోనే ఉన్న అరటి మొక్కలను పెకిలించి వేశాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

సోమల- పుంగనూరు ప్రధాన రహదారికి సమీపంలో ఆదివారం రాత్రి జంట ఏనుగులు సంచరించడం ఆతర్వాత ఎటు వెళ్ళాయో తెలీని పరిస్థితి. ప్రధాన రహదారులను రాత్రివేళల్లో ఏనుగులు దాటుతూ స్వేచ్ఛగా విహరిస్తూ ఉంటే రాత్రి వేళల్లో రహదారులపై ప్రయాణించే వాహనదారులు ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో తిరుమల పాదయాత్ర వెళ్లే భక్తులు రాత్రివేళల్లో పుంగనూరు, చౌడేపల్లి, సోమల మార్గంలో నడిచి వెళుతూ ఉంటారు. అదేవిధంగా రాత్రి వేళల్లో అడవి పందులు, ఇతర జంతువుల నుండి పంటలను కాపాడుకునేందుకు రైతులు శబ్దాలు చేస్తూ పంటల వద్ద జాగారం ఉంటున్నారు. ఇలాంటి సమయాలలో ఏనుగులు ప్రాణనష్టాన్ని కలిగిస్తాయేమోనని రైతులు అంటున్నారు. కాగా అటవీ శాఖ సిబ్బంది నిత్యం ఏనుగుల కదలికలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు అటు రైతులను ఇటు అటవీ సమీప గ్రామ ప్రజలను వాహన చోదకులను అప్రమత్తం చేస్తూ ఉంటే రైతులు, ప్రజలు కూడా ఏనుగుల బారి నుండి పడకుండా పంటలను కాపాడుకునేందుకు అటవీ శాఖకు సహకరించే అవకాశం ఉంది. ఏది ఏమైనా అటవీ శాఖ సిబ్బంది రైతులు, ప్రజల సమన్వయంతో ఏనుగుల బారి నుండి మండల ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



- జిల్లాలో 3,63,556 మంది బాలబాలికలు
- 1 నుంచి19 సంవత్సరాల పిల్లలకు
- అల్బెండోజోల్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ఈనెల 9వ తేదీ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ అంగన్వాడీ కేంద్రాల్లోని 3,63,556 మంది ఒకటి నుండీ 19 సంవత్సరాల లోపు పిల్లలకు అల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య ఆర్యోశాఖ సమాయత్వం అవుతోంది. అల్బెండోజోల్ 400 ఎంజి మాత్రలు జిల్లా వ్యాప్తంగా ఉన్న పిల్లలకు పంపిణీ చేయనున్నారు. ఈనెల 9వ తేదీ మాత్రలు వేసుకోని వారికి 16వ తేదీ అందించనున్నారు. 1 నుండి 2 సంవత్సరాల పిల్లలకు అర్ధమాత్ర (1/2 మాత్ర), 2 నుండి 19 సంవత్సరాల పిల్లలకు 400ఎంజి ఒక మాత్ర మాత్రమే. మధ్యాహ్నం భోజనం తిన్న తర్వాత మింగించాలని వైద్య ఆరోగ్యశాఖ సూచిస్తోంది. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలోని 3,63,556 మంది పిల్లలున్నట్లు గుర్తించారు. ఆరోగ్యవంతమైన పిల్లల భవిష్యత్ కోసం నులిపురుగులను నిర్మూలించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జిల్లా వైద్యఆరోగ్య శాఖ, విద్య, సర్వశిక్ష అభియాన్, స్త్రీ శిశు సంక్షేమ, మున్సిపల్ కమిషనర్లు, సాంఘిక, బిసి,మైనారిటీ, గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ఇంటర్మీడియెట్, జడ్పీ, సమాచార, గ్రామీణ నీటి సరఫరాశాఖల అధికారులతో సమన్వయంతో ఈనెల 9వ తేది, 16వ తేది విజయవంతం చేసేందుకు జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి వివిధశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి విజయవంతం చేయాలని ఆదేశించారు.

ముఖ్య ఉద్యేశం ఇదే...

ఆరోగ్యవంతమైన పిల్లల భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక వైద్యసౌకర్యాలు కల్పిస్తుందన్నారు. పిల్లల కడుపులోని (కొంకి పురుగు, నులిపురుగు, బద్దే పురుగు, గుండ్రని పురుగులను) నివారించడం ద్వారా పిల్ల ఆరోగ్యవృద్ధి పెంపొందించి తద్వారా పిల్లలు ఉన్నత పౌరులుగా ఎదుగుతారు. జిల్లాలోని 2,20 అంగన్వాడీ కేంద్రాలు, 2,80 ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూల్‌లు, 137 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలోని 3,63,556 మంది పిల్లలకు సిబ్బంది అల్బేండోజోల్ మాత్రలను మింగిచనున్నారు. 1 నుండి 2 సంవత్సరాల లోపు పిల్లలకు అర్ధ మాత్ర (1/2 మాత్ర)ను 2 నుండి 19 సంవత్సరాల పిల్లలకు 400 ఒక్క మాత్ర నుమధ్యాహ్నం భోజనం తర్వాత ఆల్బెండజోల్ మాత్రను మింగించాల్సి ఉంటుంది.

భోజనం తరువాతనే మాత్రను మిగించాలి..

మధ్యాహ్నం భోజనం తిన్న తర్వాతనే ఆల్బెండజోల్ మాత్రను మిగించాలి. మాత్రను పిల్లలకు ఏదైనా అనారోగ్యం కలిగిన 104, 108 వాహనాలు అందుబాటులో ఉంటాయి. మాత్రలు తీసుకున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా వెంటనే సమీపంలోని ప్రాథమిక, సామాజిక ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందిచే ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు దిడ్డివారిపల్లిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని దిడ్డివారిపల్లి సచివాలయం వద్ద మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఉదయం 9గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వైద్య నిపుణులు పరీక్షలు చేసి సూచనలు చేయడంతో పాటు మందులు పంపిణీ చేస్తారని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

11న నగరికి వైఎస్.షర్మిల రాక

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షులు షర్మిల ఈ నెల 11న నగరికి రానున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 11న (ఆదివారం) సాయంత్రం 4గంటలకు షర్మిలరెడ్డి నగరికి విచ్చేసి స్థానిక ఓం శక్తి దేవాలయం నుండి నగరి బస్టాండ్ టవర్ క్లాక్ వరకు రోడ్ షో నిర్వహించి, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

10న ఉచిత గుండె వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-సదుం: మండల కేంద్రంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో ఈనెల 10న ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సదుం మణికంఠ లయన్స్ క్లబ్ అధ్యక్షులు చాముండేశ్వరయ్య, కార్యదర్శి జి.మల్లయ్య సోమవారం సదుం విలేకరులకు తెలిపారు. వారు మాట్లాడుతూ బెంగళూరు వైదేహి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ దుర్గా ప్రసాద్‌రెడ్డి చే డయాబిటీస్, బి.పి, షుగర్, ఈ.సి.జీ, 2 డిఏకో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు 8790120646 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఘన సన్మానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు శివయ్యకు సోమవారం ఎంఈవో రమేష్, హెచ్ఎం ధనంజయరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బంగారుపాళ్యం సీఆర్‌సీ ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంఈవో రమేష్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికీ పదవీ విరమణ సహజమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పరంధామయ్య, భాస్కర్, అమ్ములు, సుశీల, ప్రేమలత, నవీన్, లీలావతి, రామస్వామి పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: టీడీపీ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా బంగారుపాళ్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. సోమవారం టీడీపీ కార్యాలయ ఆవరణంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్రనాయుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌లు మూతపడడంతో పేదవారి ఆకలి తీర్చేందుకు తమ వంతుగా అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ప్రకాష్‌నాయుడు, నాయకులు బాబు, గిరిబాబు పాల్గొన్నారు.

మందులు పంపిణీ

ప్రజాశక్తి-సోమల: సోమల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పంచాయతీ గ్రామాలలో సోమవారం జిల్లా డీపీఎంవో దేవదాస్ పర్యటించి కుష్టు వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కుష్టు వ్యాధి సోకిన పలువురికి ప్రభుత్వం ఉచితంగా అందజేసే మందులు, మాత్రలు, చెప్పులు పంపిణీ చేశారు. ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులవారిపల్లి, గంగిరెడ్డిగారిపల్లి, గురికానివారిపల్లి గ్రామాలలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి పర్యటించి కుష్టు వ్యాధి అంటు వ్యాధి కాదని సరైన సమయంలో సరైన జాగ్రత్తలతో వైద్యుల సలహాతో సూచనలు పాటిస్తే వ్యాధి నయమవుతుందని ఇందుకోసం ప్రభుత్వం ఉచితంగా మందులు మాత్రలు పంపిణీ చేస్తోందని అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఓ అమర్నాథ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త శీనప్ప అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం టిడిపి నేతలు ఆయన భౌతికయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ తరపున వారి కుటుంబ సభ్యులకు తక్షణసాయంగా రూ.10వేలు అందజేశారు. మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, నేతలు విజయ్‌కుమార్, ఆనందప్ప, విజయ్‌కుమార్ రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్ఎం విశ్వనాధయ్య అధ్యక్షతన డిపిఎమ్ఓ దయానందం కుష్టు వ్యాధి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైకో బాక్టీరియం లేప్రే అనే సూక్ష్మ క్రిమి వలన వచ్చును, శరీరంపై స్పర్శ ,నొప్పి, నవ్వలేని రాగి రంగు గల మచ్చలు ఉన్నచో వైద్యాధికారి దగ్గర నిర్ధారించుకుని మందులు వాడినట్లయితే అంగవైకల్యమును నివారించవచ్చునని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సావిత్రి హెల్త్ ఎడ్యుకేటర్, సిహెచ్ఓ అనురాధ, ఆశాలు జయమ్మ ,రాజేశ్వరి, మొబీన, భారతి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని నీర్పాకోట ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో రెండవ మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం సోమవారం మధ్యాహ్నం భోజనాన్ని, రాగి జావ రుచి చూసి పరీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలతో రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. గాజుల పెళ్లూరు వైసీ కాలనీలో పాఠశాల విద్యార్థులను విద్య, వసతి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రతిరోజూ స్కూలుకు రావాలని సూచించారు. 5వ తరగతి విద్యార్థులకు తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తగా వచ్చారు

కొలువుదీరారు

జిడి నెల్లూరు సిఐ మారుతి శంకర్

బైరెడ్డిపల్లి తహశీల్దార్ స్వర్ణలత

కార్వేటినగరం తహశీల్దార్ పుష్పకుమారి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు నూతన సీఐగా మారుతి శంకర్ కర్నూలు జిల్లా నుంచి బదిలీపై వచ్చి సోమవారం బాధ్యతలు చేపట్టారు.

బైరెడ్డిపల్లి: మండల నూతన తహశీల్దార్‌గా స్వర్ణలత సోమవారం బాధ్యతులు స్వీకరించారు. ఆమె అనంతపురం జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు.

కార్వేటినగరం: మండల తహసీల్దార్ పుష్పకుమారి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా కైలకుంట్ల మండలం నుంచి వచ్చారు. ఆమెకు స్థానిక ఎంపీపీ లతబాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

ప్రజాశక్తి-రామకుప్పం: రామకుప్పం తహసిల్దార్‌గా శ్రీధర్ సోమవారం బాధ్యత స్వీకరించారు. అనంతపురం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.

పలమనేరు: నూతన తహశీల్దార్‌గా రంగనాయకులు బాధ్యతలు స్వీకరించారు. ఈయన సత్యసాయి జిల్లా గోరంట్ల నుంచి బదిలీపై వచ్చారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు తహశీల్దార్‌గా శ్రీనివాస్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఇక్కడి బదిలీపై వచ్చారు.

చిత్తూరు తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

రామకుప్పం తహశీల్దార్ శ్రీధర్

పలమనేరు తహశీల్దారు రంగనాయకులు

వైసిపి పాలనలో దళితులకు అన్యాయం

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ

మాజీ ఎంఎల్ఏ గాంధీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైసిపి పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ ఎంఎల్ఏ ఆర్.గాంధీ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో నాటి గుడిపాల నియోజవర్గ ఎంఎల్‌ఏగా విజయం సాధించిన తాను 2019లో వైఎస్సార్‌సీపీలో చేరిన్నట్లు తెలిపారు. అయితే జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పిందే వేదమని ఎంపిగా ఉన్న రెడ్డప్ప ఆయన ముందుకు కూర్చోనేందుకు భయపడే పరిస్థితి ఉందన్నారు. జిల్లాలోని దళిత సిటింగ్ ఎంఎల్ఏలు ఆదిమూలం, ఎంఎస్ బాబులను పక్కన పెట్టడం చూస్తే దళితులకు జరుగుతున్న అన్యాయం ఏపాటిదో అర్థమవుతోందన్నారు. దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక తాను మంగళవారం జీడినెల్లూరు రా...కదలిరా.. తెలుగుదేశం బహిరంగ సభలో చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలు గాలికొదిలేశారు: చల్లా బాబు

ఇంటింటి ప్రచారంలో చల్లా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పుంగనూరు: మున్సిపాలిటీలోని సమస్యలను కౌన్సిలర్లు గాలికి వదిలేశారని, అభివృద్ధిని పూర్తిగా మరిచారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని పట్టణంలోని ఎన్ఎస్ పేటలో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిలర్లు ప్రజలు ఎన్నుకొని ఉంటే వార్డు సమస్యలు తెలిసేదని వారి నాయకుడు పోలీసులను అడ్డం పెట్టుకొని అన్ని వార్డులను ఏకగ్రీవం చేసుకున్న విషయం ప్రజలందరికీ తెలుసు అన్నారు. వార్డుపై కౌన్సిలర్లకు అవగాహన లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడ తిష్ట వేశాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. పట్టణంలో మైనారిటీలు అన్ని వర్గాల ప్రజలు టీడీపీని ఆదరిస్తున్నారని చెప్పారు. ఇక రెండు నెలల్లో రాష్ట్రంలో వైసీపీని ఇంటికి పంపడం తథ్యం అన్నారు. జనసేన పార్టీ మద్దతు తెలుపుతూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ కాలనీ,అలగన్నార వీధి,మఠం తోపు,గాజుల వీధి,గంగమ్మ వీధి,దాసర వీధి,రామసముద్రం రోడ్డు ప్రాంతాల్లో విజయవంతమైన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేశాధి ప్రకాష్, శ్రీకాంత్, మాధవరెడ్డి, సయ్యద్ సుహేల్ భాష, ఐ టి డి పి కుమార్, రామయ్య, గంగులప్ప, కుమార్, సద్దాం, జనసేన నాయకులు పగడాల రమణ, చిన్న రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాలపై కఠినచర్యలు తీసుకోవాలి: సీపీఎం

ప్రజాశక్తి - ఓజిలి : ఓజిలి మండలం పెద్దపరియ నెల్ క్యాస్ట్ పరిశ్రమ ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మిస్తున్న ప్రహరీ గోడను వెంటనే ఆపాలని సిపిఎం ఆధ్వర్యంలో ఓజిలి డిప్యూటీ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేత చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓజిలి మండలంలోని పెద్దపరియ రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 24 ,25పరిధిలో నెల్ క్యాస్ట్ పరిశ్రమ ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మిస్తున్న రెవెన్యూ అధికారులకు కనబడడం లేదా?' అని దుయ్యబట్టారు. లక్షల రూపాయలు విలువచేసే భూములు కాపాడడంలో రెవెన్యూ అధికారులు భూస్వాములకు, పరిశ్రమ యాజమాన్యులకు తొత్తులుగా మారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రహరీ గోడ నిర్మాణం ఆపాని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పరిశ్రమ చేసే అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. పేదోళ్లు జానుడు జాగా అడిగితే మాత్రం భూములు లేవని చెప్పే అధికారులు భూస్వాములు కబ్జాలకు పాల్పడుతుంటే రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నేత బి గోపాలయ్య, పెద్దపరియ గ్రామస్తులు చేజర్ల పెంచలయ్య ,రామయ్య పాల్గొన్నారు.

క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను గుర్తించి సకాలంలో ఆసుపత్రుల్లో చేర్పిస్తే కేంద్ర ప్రభుత్వం ఐదు వేల రూపాయల నగదు ప్రోత్సాహకం అందిస్తుందని ఆర్‌టివో ఆదినారాయణ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఆటో డ్రైవర్లకు అవగాహ న కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టివో ఆదినారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చున్నారు. సాయం చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం ఐదు వేల రూపాయలు అందజేస్తుందని, ప్రమా దాల నివారణకు నిబంధనలు పాటిం చాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంవిఐ సునీల్, పట్టణ సీఐ పాపారావు, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ షరీనా పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఆర్పీల అరెస్టు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తమ న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం విజయవాడ సభకు బయలుదేరిన ఆర్పీలను ఆదివారం అర్ధరాత్రి వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అక్కడినుంచి స్టేషన్ కు తరలించి నిర్బంధించారు. నిబంధనలు పక్కనపెట్టి మహిళా ఆర్పీలన్న కనీస మానవత్వం లేకుండా పురుష పోలీస్ కానిస్టేబుళ్లతో ఆర్పీలను స్టేషన్ కు తరలించడాన్ని సిఐటియు నాయకులు తప్పు పట్టారు. ఆర్పిలకు మద్దతుగా వన్ టౌన్ స్టేషన్ కి వెళ్లి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్పిల సభకు అనుమతి ఉన్నా పోలీసులు అత్యుత్సాహం చూపి నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య ప్రశ్నించారు. అనంతరం ఆర్పిలను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ నాయకులు జనమాల గురవయ్య పాల్గొన్నారు.

కుల గణన త్వరితన పూర్తి చేయండి: జెసీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

జిల్లాలో జరుగుతున్న గృహల రిజిస్ట్రేషన్ కార్యక్రమం వేగవంతంగా చేయాలని, డిప్యూటీ తహశీల్దార్లు నిత్యావసర వస్తువుల పంపిణీని పర్యవేక్షించాలని, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ వేగవంతంగా చేయాలని, కుల గణన పూర్తి చేసిన ప్రాంతాలలో అప్డేట్ వెంటనే చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం జాయింట్ కలెక్టర్ తహశీల్దార్‌లు, ఎంపీడీవోలు, డీటీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ.. జిల్లాలోని 402 సచివాలయాలలో రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతోందని సాంకేతిక పరమైన సమస్యలు ఉన్నచోట వాటిని గుర్తించి వెంటనే పై అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలన్నారు. తద్వారా రిజిస్ట్రేషన్ల కార్యక్రమం వేగవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాలలో జరుగుతున్న ప్రక్రియ గురించి సమీక్షించారు. జిల్లాకు మొత్తం ఇప్పటి వరకు 308544 ఆరోగ్యశ్రీ కార్డులు రావడం జరిగిందని, ఇప్పటి వరకు 2,09,585కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మిగతా కార్డుల పంపిణీ వేగవంతం చేయించాలనన్నారు. నిత్యావసర వస్తువుల పంపిణీ ఎండియూ ఆపరేటర్ల ద్వారా డీటిలు వేగవంతంగా సరఫరా చేయించాలనన్నారు. జిల్లాలో కుల గణన దాదాపు పూర్తి అయిందని వివరాలను వెంటనే అప్డేట్ చేయాలనన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల మధ్య దూరం, రూట్ వివరాలు రూట్ అధికారుల వివరాలు మెడికల్ క్యాంపులకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని, అదే విధంగా రాష్ట్ర సరిహద్దులలో 1200ఓట్లు పైగా ఒక పోలింగ్ కేంద్రంలో ఉంటే వెబ్ కాస్టింగ్ 50శాతం వరకు నిర్వహించాలని, ఆ విధమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఓ రాజశేఖర్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, డిపిఓ లక్ష్మిలతో పాటు ఆర్‌ఆర్‌డీవోలు చిన్నయ్య, మనోజ్‌కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కష్టాలు కలిమి.. కొలిమితో చెలిమి..

ప్రజాశక్తి-గంగవరం: కొలిమి పనే వారికి బ్రతుకుదెరువు. కడు పేదరికంతో ఊరుగాని ఊర్లు తిరుగుతూ సంచరిస్తున్నారు. రెక్కాడితేగానీ దొక్కాడని పరిస్థితి. కోడి కూసింది మొదలుకొని రెక్కల కష్టం చేస్తేనే వారికి బుక్కెడు బువ్వ. కొలిమిలో ఇనుపకడ్డీని సానదీసి తమ చెమటను దారబోసి గ్రామ శివార్లే ఆవాసాలుగా రోజుకోఊరు తిరుగుతున్నారు. మహారాష్ట్రకు చెందిన బాబూలాల్ కుటుంబం చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ కొలిమిపని చేసుకుంటూ జీవిస్తున్నారు. సోమవారం గంగవరం మండలంలో ఆ కుటుంబ సభ్యులు కొలిమి పని చేస్తూ మొచ్చు పారలు, కొడవళ్లు, గొడ్డళ్లు తయారు చేస్తూ కనిపించారు. తాము ఉన్న ప్రాంతంలో జీవనోపాధి లేక కుటుంబాన్ని వెంటబెట్టుకొని ఇలా చేతి వృత్తిపై ఆధారపడి వివిధ రాష్ట్రాలో తిరుగుతూ బతుకు వెళ్లదీస్తున్నట్లు వాపోయారు. రాత్రి వేళల్లో ఉండటానికి చోటు లేక వృక్షాల కిందనే ఉండి మరునాడు మరో ప్రాంతానికి వెళుతున్నట్లు వివరించారు.. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం ఉండగా.. తన పెద్దకుమారుడు, భార్యను వెంటబెట్టుకొని కొలిమిపని చేసుకుంటున్నట్లు చెప్పారు. మిగిలిన ఇద్దరు పిల్లలను స్వగ్రామంలో విడిచిపెట్టి వచ్చేశామని, ఒక్కరోజు సంపాదన లేకపోయినా పొట్ట గడవదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏడాధిలో రెండు నెలలు మాత్రమే వచ్చిన సంపాదనతో స్వగ్రామంలో గడుపుతున్నామని, గత్యంతరం లేకనే ఇలా సంచరించాల్సి వస్తోందని ఒకింత భావోద్వేగానికి లోనైయ్యారు. అది విన్న స్థానికులు వారి పట్ల సానుభూతిని వ్యక్తం చేశారు. మరికొందరు తోచిన సాయంగా పూట భోజనం ఇచ్చారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ఐడికార్డులు ధరించిన ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఆటో డ్రైవర్లు తప్పని సరిగా రోడ్డు నియమనిబంధనలు పాటించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీ ప్రసన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పని సరిగా లైసెన్సు, గుర్తింపు కార్డులు కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించకూడదని సూచించారు. ఆటో డ్రైవర్లపై దాడులు జరిగినప్పుడు అధికారులు వెనువెంటనే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం ఆటో డ్రైవర్లకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షులు చెంచుబాబు, ఉపాధ్యక్షులు ఖాదర్ బాషా, ట్రెజరర్ వెంకటేష్, కార్యదర్శి సుధాకర్, లోకేష్‌రెడ్డి, శ్రీనివాసులు, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా నారాయణస్వామి వద్దని ఆందోళన

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని, ఎమ్మెల్యేగా నారాయణస్వామి వద్దు అని డిప్యూటీ సీఎం వ్యతిరేక వర్గీయులు సోమవారం ఆందోళన చెపట్టారు. వేల్కూరు బాబురెడ్డి, తిరువీధి కుప్పం సాంబశివారెడ్డి, పెనుమూరు మండలం దయాసాగర్ రెడ్డి, కార్వేటినగరం ధనుంజయరెడ్డి, పాలసముద్రం మండలం శివ ప్రకాష్ రాజు, వెజ్జుపల్లె నాయనరెడ్డి, డిప్యూటీ సీఎం మేనల్లుడు రమేష్‌లు ధ్వజమెత్తారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీడీ నెల్లూరులో సోమవారం డిప్యూటీ సీఎంకు వ్యతిరేకంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ ఎట్టి పరిస్థితుల్లోనూ నారాయణ స్వామికి ఇవ్వరాదని ఆయన స్థానంలో కొత్త వ్యక్తులకు అవకాశం ఇవ్వాలని వారు కోరారు. నారాయణస్వామిని మాత్రం చిత్తూరు ఎంపిగా పంపించాలని వారు సీఎం జగన్ మోహన్ రెడ్డికి విన్నవించారు. నియోజకవర్గంలో ప్రతి మండలం నందు నారాయణస్వామి వైసిపి లోనే వర్గ విభేదాలు పెంచేసి వేడుక చూస్తున్నారని ధ్వజమెత్తారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

సమావేశంలో పెనుమూరు జడ్పిటిసి దొరస్వామి మందడి, మాజీ జెడ్పిటిసి గుణశేఖర్ మొదలి, ప్రభాకర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, షైనీ శేఖర్, గోవింద రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే తిరుపతి రాజధాని: మాజీ మంత్రి

ప్రజాశక్తి -కోట : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే తిరుపతిని రాజధానిని చేయడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. సోమవారం కోట మండలంలోని సిద్ధవరం,ఉత్తమ నెల్లూరు, ఉచ్చూరు వారి పాలెం,కొక్కుపాడు గ్రామాల్లో చింతా మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ఎన్నో సంవత్సరాలుగా తిరుపతిని రాజధాన్ని చేయాలనే కోరిక తనకు వుందని, దుగరాజపట్నం పోర్టును నిర్మించి లక్షలాదిమందికి ఉద్యోగ ం, ఉపాధి కల్పిస్తామని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజలు ధనవంతులుగా మారే అవకాశాలు వున్నాయన్నారు. అంగన్వాడీ లు, మున్సిపల్ కార్మికులు, శ్రీ సిటీ కార్మికులు అభివృద్ధికి, రైతులకు రుణమాఫీ గిట్టుబాటు ధర, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వగలిగే శక్తి సామర్థ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికే వుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పంటాశ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దుంపల నాగరాజ్, తిరుపతి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తేజోవతి, కోట మండలం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వాకాడు మండల కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్ పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు గ్రామ సచివాలయ పరిధిలో 14 మందికి నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు సర్పంచ్ బాషా తెలిపారు. సోమవారం లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి- నారాయణవనం : మండల కేంద్రంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును నారాయణవనం పోలీసులు సోమవారం సీజ్ చేశారు. గత కొన్ని నెలలుగా మండలంలోని చిత్తూరు కండ్రిగ , గోవిందప్పనాయుడుకండ్రిగ , రాళ్ల కాలువ, కీళగరంలోని అరుణానదిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. దీనిపై స్థానిక ప్రజల నుండి పెద్ద పోలీసులకు పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో దృష్టి పెట్టిన పోలీసులు ఇసుక లోడింగ్ చేస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కి తరలించి ట్రాక్టర్ యజమాని టీ ఊరప్ప, డ్రైవర్ బి రఘులను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - ఓజిలి : కోడిపందేల స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి ఐదు గురిని అదుపులో తీసుకున్నారు. ఎస్ఐ .పి రవిబాబు కథనం మేరకు మండలంలోని జోసులవారి కండ్రిగ గ్రామ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించగా కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురితో పాటు రెండు పందెం కోళ్ళు , రూ.11,20 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసుదర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు ,అఖిల్ , రమేష్ ,రవి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పలమనేరు: కౌండిన్య నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కేటిల్ ఫారం సమీపంలోని ఏటిగడ్డ ఎల్లమ్మ గుడి ఎదురుగా ఉన్న కౌండిన్య నదిలో గుర్తు తెలియని వ్యక్తిమృతదేహాన్ని గుర్తించారు. సుమారు 40ఏళ్ల వయస్సు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. 3రోజుల ముందు నీళ్లలో పడి చనిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతిడు ఆకుపచ్చ రంగు నిలువు అడ్డుగీతలు గల ఫుల్ షర్టు, బ్లూ రంగు ఫ్యాంటు ధరించి, అతని శరీరంపై జంధ్యం ఉన్నట్లు పోలీసులు చెప్పారు. వివరాలు తెలిసిన వారు 9440796733, 9440796734 సంప్రదించాలని పోలీసులు కోరారు.

'అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం'

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్రంలో అట్టడుగు వర్గాల అభివృద్ధి టీడిపితోనే సాధ్యమని అందుకే టిడిపికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని బల్ల పంచాయితీలో గ్రామ వికాస సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరించాలన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సరంలో వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి చేతనం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి నరసింహులు నేతలు చలపతి, చిన్న కృష్ణ, నారాయణచారి, రామ్మూర్తి, రామకృష్ణప్ప, జయశంకర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDL JUNIOR CIVIL JUDGE SANGAREDDY
O.S.NO. 135 OF 2023

Between:
Kanyadhara Nityananda Vara Prasad, ...Plaintiff.
And
Yarramaneni Kameswara & others, ...Defendants.

To
Vittalam Raja Reddy s/o Thimma Reddy, Aged 76 years, Occ: Business, Amaravathi Nagar, M.R.Palli (Mutyala Reddypalli), Door No.9-62, Thirupathi Urban, Chitturu District A.P.517502, ...Dependent/Respondent No 2.

WHEREAS the plaintiff have filed the above suit for declaration of title and consequential injunction against you. The said suit is posted to 13-02-2024 for your appearance. You are hereby required to appear on that day at 10.30 a.m. either in person or through pleader, failing which the matter will be decided as per law.

// BY ORDER OF THE COURT //
B.SRAVAN KUMAR,
Advocate,
Sangareddy.